నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా జవహర్ నవోదయ, లక్ష్మీవిహార్ ఫీడర్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట నారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ జవహర్ నవోదయ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జవహర్ నవోదయ, కంచ గచ్చిబౌలి, అబాడ్ స్కూల్, అపర్ణ సరోవర్ ఎదురుగా ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.
- 11 కేవీ లక్ష్మీవిహార్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు లక్ష్మీవిహార్ ఫేజ్–1 కాలనీ, ఫేజ్–2 కాలనీ, డిఫెన్స్ కాలనీ, నల్లగండ్ల విలేజ్, డాక్టర్స్ కాలనీ, సౌత్ పార్కు ఏరియాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

మియాపూర్‌లో..

మియాపూర్: పీఎస్‌ఆర్ హిల్స్, ఎఫ్‌సిఐ కాలనీ, బీకే ఎన్‌క్లేవ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

- గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల నుండి ఆర్టీసీ కాలనీ, పీఎస్‌ఆర్ హిల్స్, హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ, కమ్యూనిటీహాల్ ఏరియా
- మధ్యాహ్నం 1.30 నుండి 3 గంటల వరకు టాకిటౌన్ ఏరియా,ఎఫ్‌సిఐ కాలనీ, వీడిఐ కాలనీ, పీఎస్‌నగర్, హమాన్ కాలనీ, ఆర్వీ నిర్మాణ అపార్ట్‌మెంట్
- అదేవిధంగా 3.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు జేపీఎన్‌నగర్ మెయిన్ రోడ్డు, విశ్వనాథ్ గార్డెన్ ఏరియా, జనప్రియ వెస్ట్‌సిటీ, కృష్ణసాయి ఎన్‌క్లేవ్ , హెచ్ఎంటీ మక్త ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.
- కేంద్రీయ విహార్, రెడ్డికాలనీ, గోకరాజు ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 1.30 నుండి 3 గంటల వరకు రెడ్డి కాలనీ, బీకేఎన్‌క్లేవ్, 3.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు గోకరాజు కాలనీ, వెంకట్‌రావునగర్ కాలనీ, బాలాజీనగర్, ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్: వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- కెపిఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 7.00 గంటల నుంచి ఉదయం 7.30 గంటల వరకు కెపిఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్, కెపిఎస్‌ఆర్ రోడ్డు నెంబర్ 1,2,4,6 ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.
- శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 7.30 గంటల నుంచి ఉదయం 8.00 గంటల వరకు శంకర్‌నగర్, శిల్పా ఎన్‌క్లేవ్, గౌతమీనగర్ ప్రాంతాలలో..
- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8.00 గంటల నుంచి ఉదయం 8.30 గంటల వరకు భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్ కాలనీ రోడ్డు నెంబర్లు 3,4,6 తదితర ప్రాంతాలలో..
- పీజేఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 9.00 గంటల వరకు పీజేఆర్ ఎన్‌క్లేవ్, రోడ్డు నంబర్ 3,5,7 ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ హుండాయ్–2 పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు హుండాయ్ కార్యాలయం, పరిసరాలు, మాతా భువనేశ్వరికాలనీ, ఖానామెట్ వంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

- 11 కేవీ ఇజ్జత్‌నగర్–2 ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు ఇజ్జత్‌నగర్ మొత్తం వీకర్ సెక్షన్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో .. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వారు వివరించారు.

- 11 కేవీ బ్రహ్మకుమారీస్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు బ్రహ్మకుమారీస్ సంస్థ కార్యాలయం, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, రాక్ ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో
- 11 కేవీ జేవీకాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రీయ విహార్, జేవీకాలనీ, డీఎస్‌ఆర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

రేపు పాలిసెట్-2024 ప్రవేశపరీక్ష

ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రం లోపలికి అనుమతి లేదు



పరీక్షా కేంద్రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

- ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి
- శేరిలింగంపల్లి జోన్ పరిధిలో అయిదు పరీక్షా కేంద్రాలు
- 5 సెంటర్లు..పరీక్ష రాయనున్న 1085 మంది విద్యార్థులు

రాయదుర్గం: పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం (మే 24వ తేదీ) నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను పాలిసెట్–24 రీజనల్ కోఆర్డినేటర్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ రీజనల్ పరిధిలోని గచ్చిబౌలి, రాయదుర్గం, మధురానగర్, నార్సింగి, మణికొండ ప్రాంతాలలో ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. విద్యార్థులు ప్రవేశ పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని సూచించారు. ఒకరోజు ముందు గానే తమ వెంబడి వచ్చే వారు పరీక్షా కేంద్రాన్ని గుర్తించేలా చేయడానికి చొరవ తీసుకోవాలని, లేదంటే యాప్‌ను ఉపయోగించి వెంటనే తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పాలిసెట్‌లో అర్హత సాధించిన వారికి జీఐఎల్‌టీలోని కోర్సులలో చేరడానికి అడ్మిషన్లకు అవకాశం కల్పించడం జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష వివరాలు..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం (మే 24వ తేదీ) నిర్వహిస్తారు.

- పరీక్షను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుంది
- శేరిలింగంపల్లి జోన్ పరిధిలో అయిదు ప్రవేశ పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు.
- ఒక్క నిమిషం (ఉదయం 11 గంటల తర్వాత) ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించకూడదని నిర్ణయించారు.
- విద్యార్థులను ఒక గంట ముందు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు
- గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకొనేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

మొత్తం విద్యార్థులు 1,085 మంది

- పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది ఇవే..
- పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి తీసుకెళ్ళనీయరు.
- ముఖ్యంగా సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్ వంటి వాటిని అనుమతించరు.
- బబ్లింగ్‌కు హెచ్‌బీ పెన్సిల్‌ను వినియోగించాలి. హాల్ టికెట్, పెన్, హెచ్‌బీ పెన్సిల్, షార్ప్‌నర్, ఎరేజర్‌ను మాత్రమే అనుమతిస్తారు
- విద్యార్థులకు సెంటర్ లొకేషన్, ప్రవేశ పరీక్షకు సంబంధించి ఇతర సమస్యలుంటే వెంటనే సెల్ నంబర్ 9912342053ను సంప్రదించాలి.

ప్రాంతం	పరీక్షా కేంద్రంపేరు	విద్యార్థుల సంఖ్య
రాయదుర్గం	గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్‌టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్	125 మంది
గచ్చిబౌలి	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	240 మంది
మధురానగర్	ప్రభుత్వ జూనియర్ కళాశాల	240 మంది
మణికొండ	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల	240 మంది
నార్సింగి	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	240 మంది

పరీక్షా కేంద్రం లొకేషన్‌ను గుర్తించడానికి యాప్–ఎస్‌బిటీఈటీ టీఎస్‌ను గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది

ఏర్పాట్లు పూర్తి



శేరిలింగంపల్లి పరిధిలోని అయిదు సెంటర్లలో ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. స్వయంగా అయిదు కేంద్రాలను పరిశీలించి అన్ని సౌకర్యాలు ఉండేలా మాట్లాడాం. తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఒక్కనిమిషం ఆలస్యమైనా కేంద్రం లోపలికి అనుమతించరాదని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పోలీసుల సహకారం కూడా తీసుకుంటున్నాం. సెంటర్లను కూడా సులభంగా గుర్తించే వాటినే ఎంపిక చేశాం. గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఏర్పాట్లు చేసుకోవాలి. – షేక్ ఎక్బాల్ హుస్సేన్, రీజనల్ కోఆర్డినేటర్, జీఐఎల్‌టీ ప్రిన్సిపల్

పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మనూ ప్రధాన క్యాంపస్‌లోని పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించినట్లు 'మనూ' పాలిటెక్నిక్ హైదరాబాద్ ప్రిన్సిపల్ డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్ బుధవారం తెలిపారు. ఉర్దూ మీడియం నుంచి లేదా ఉర్దూను ఒక సబ్జెక్టుగా చదివిన విద్యార్థుల కోసం నాలుగు డిప్లొమో కోర్సులలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలిటెక్నిక్‌లో డిప్లొమో ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి నాలుగు కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్లతో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను సమర్పించాలని, ప్రాస్పెక్టస్, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ నందు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9848171044లో సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ గోకుల్ ప్లాట్స్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో శ్రమించిన పార్టీ నాయకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాంబయ్య, సంజీవరెడ్డి, శివాజీ, ప్రకాష్‌రెడ్డి, దుర్గారావు, పూర్ణ, హరిబాబు, సుబ్బారావు, రాంమోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దేవా, వెంకటేశ్వరరావు, వసంత్, అశోక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల అందజేత



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేసిన జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జన్మదినం సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్‌గౌడ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించి తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తాన్ని అందజేశారు.

జీవవైవిధ్యం లేనిదే మానవ మనుగడ లేదు..

ఎంపీడీఓ యాదగిరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ యాదగిరి

పటాన్‌చెరు టౌన్: జీవ వైవిధ్యం లేనిదే మానవ మనుగడ లేదని పటాన్‌చెరు ఎంపీడీఓ యాదగిరి అన్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంను బుధవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ జీవ వైవిధ్య మండలి, పర్యావరణ పరిరక్షణ శిక్షణ సంస్థల సహకారంతో నిర్వహించారు. విద్యార్థులతో కలసి పటాన్‌చెరు పట్టణంలో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీడీఓ యాదగిరి జీవవైవిధ్యం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... పూర్వం చిరుధాన్యాల వాడకంతో ఆరోగ్యంగా ఉండేవారని తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ శ్రీహరిరెడ్డి జీవవైవిధ్య పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలను, చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా వాడటం వల్ల వచ్చే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, రంగోలి పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. ప్రతిభ కనబరించిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. మండలి జిల్లా సమన్వయకర్త రఘునందన్, కళాశాల అధ్యాపకులు రాధిక, స్వాతి ,వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, జీవవైవిధ్య మండలి సభ్యులు పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. 'యాంటీ టుబాకో డే'ను పురస్కరించుకొని 'విన్ లైఫ్ త్రూ ఓవర్ కమింగ్ అడిక్షన్స్' అనే అంశంపై హోమియోపతి ఫిజీషియన్, కార్పొరేట్ ట్రైనర్, బ్రహ్మకుమారీస్ సంస్థ మెడికల్ వింగ్ యాక్టివ్ సభ్యురాలు డాక్టర్ బి.కె. శ్రీలత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా లక్ష్మీ నృసింహస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కూకట్‌పల్లి: లీలాద్రిక్షేత్ర శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ తులసీనగర్‌లోని లీలాద్రిక్షేత్రంలో త్రిదండి చిన జీయర్ స్వామివారి మంగళ శాసనములతో, శ్రీమాన్ శ్రీ చక్రవర్తుల శ్రీ వత్సచార్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో వేడుకలు జరుగుతున్నాయని ఆలయ ఫౌండర్, చైర్మన్ మాధవరం కాంతారావు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం శ్రీలక్ష్మీ నరసింహ జయంతిని పురస్కరించుకొని ఉదయం 8 గంటలకు నిత్యహోమం, పూర్ణాహుతి, ఉదయం 10 గంటలకు శ్రీ లక్ష్మీ నరసింహ కల్యాణం, సాయంత్రం 5 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్రం, భజన, ఆరాధన, స్వామి అమ్మవార్ల ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

21 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 21 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 21 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

చెరువు శుద్ధి చేయిస్తాం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పెద్ద చెరువును శుద్ధి చేస్తామని, చెరువులో మురుగునీరు చేరకుండా 16 కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపొందిస్తున్నామని కమిషనర్ జ్యోతిరెడ్డి తెలిపారు. వివిధ కాలనీల్లో నుంచి వస్తున్న మురుగునీటితో చెరువు కంపు కొడుతుందని కాలనీవాసులు బుధవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ మురుగునీరు చెరువులో కలవకుండా వేరే మార్గం ద్వారా పోయేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని ప్రభుత్వానికి పంపించి నిధులు మంజూరు కోరుతామని వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మానందరావు, పూర్ణచంద్రరావు, రాంబాబు, వెంకటప్పయ్య, మోహన్, బాబు, పుండరికాక్షశర్మ, రఘురామ్, ఉమాదేవి పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం



మహ్మద్ అఫ్జలుద్దీన్

గచ్చిబౌలి: డ్యూటీకి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇర్ఫాన్‌నగర్ కాలనీ, కాగజ్‌నగర్ కొమరంభీం జిల్లాకు చెందిన మహ్మద్ అఫ్జలుద్దీన్(33) చాంద్రాయణగుట్టలో నివాసం ఉంటున్నాడు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని బిర్లా సాఫ్ట్ కంపెనీలో సీసీ టీవీ సర్వీస్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 19న ఉదయం డ్యూటీకి వచ్చి పని ఉందని బయటకు వెళ్లాడు. ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి అఫ్సరుద్దీన్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహ్లాదకరంగా 'వన్ 8 కమ్యూన్'



సాక్షి, సిటీబ్యూరో: అగ్రశ్రేణి క్రికెటర్ విరాట్ కోహ్లీ గచ్చిబౌలిలోని నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసిన వన్ 8 కమ్యూన్ రెస్టారెంట్ ప్రారంభ ఈవెంట్స్ అతిథులను ఆకట్టుకుంటున్నాయి. గత రెండు రోజులుగా హీరో మంచు మనోజ్ బర్త్‌డే, సహా వరుస ఈవెంట్స్‌తో అలరిస్తున్న ఈ రెస్టారెంట్... బుధవారం నగరానికి చెందిన పలువురు వ్యాపార రంగ ప్రముఖులు, పేజ్‌త్రీ సెలబ్రిటీస్ కోసం ప్రత్యేక ఈవెంట్ నిర్వహించింది. ఈ సందర్భంగా అతిథులకు తమదైన ప్రత్యేక రుచులను ఆకట్టుకునే సంగీత నేపథ్యంలో అందించారు. కార్యక్రమంలో సానియా మీర్జా కుటుంబం, నటి, నిర్మాత సుప్రియ అక్కినేని... తదితరులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని వన్ 8 కమ్యూన్ కో ఫౌండర్ వర్తిక్ తిహారా పర్యవేక్షించారు.

చెరువులు.. మురికికూపాలు

- వచ్చి చేరుతున్న చెత్తా, చెదారాలు
- గేటెడ్ కమ్యూనిటీల నుంచే..
- వాట్సాప్ గ్రూప్‌ల్లో వార్



చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న నైబర్‌హుడ్ అసోసియేషన్ సభ్యులు

తెల్లాపూర్ చెరువులలోకి మురుగునీరు చేరడంపై వాట్సాప్ గ్రూప్‌లలో చర్చనీయంగా మారింది. రెండు రోజల క్రితం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేళ్ల చెరువు పరిసరాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. దీంతో ఈ అంశం వాట్సాప్ గ్రూప్‌లలో చర్చనీయంగా మారింది. తెల్లాపూర్ గ్రామస్తులు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తెల్లాపూర్ పరిధిలోని మేళ్ల చెరువు, వనం చెరువు, చేలికుంటలో ఒకప్పుడు స్వచ్ఛమైన నీరు ఉండేదని, ఆ నీటిని కూడా తాము తాగేవారమని గుర్తుచేశారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు):

నైబర్‌హుడ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో చెరువుల పక్కన ఉన్న చెత్తను శుభ్రం చేస్తున్నారే తప్ప వారి గేటెడ్ కమ్యూనిటీ కాలనీ నుంచి చెరువులోకి మురుగునీరు రాకుండా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అనేక మత్స్యకార కుటుంబాలు ఈ చెరువులపై ఆధారపడి జీవించేవారని, రియల్ ఎస్టేట్ పుణ్యమా అంటూ ఈ ప్రాంతంలో అనేక గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు రావడంతో చెరువులు మాయం అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

శుద్ధిచేసి బయటకు వదలాలి..

ఆ కాలనీల నుంచి వచ్చే మురుగు నీటితోనే చెరువులకు ఈ దుస్థితి పట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలలో మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లు ఉన్నాయా, ఉంటే అవి పనిచేస్తున్నాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆ కాలనీలలోని మురుగు నీటిని ఎస్టీపీ ప్లాంట్‌లద్వారా శుద్ధిచేసి బయటకు వదలాలి. కానీ అనేక కాలనీలలో ఎస్టీపీ ప్లాంట్‌లు పనిచేయడం లేదని, ఆ మురుగు నీటిని చెరువులోకి వదులుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకోవడం లేదు..

అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులు ఇక్కడికి వచ్చి చెరువు పరిసరాలను శుభ్రం చేయడం మంచి కార్యక్రమమే కాని వాళ్ల కాలనీలలో నుంచి మురుగునీరు చెరువులోకి రాకుండా ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని వాపోతున్నారు. ప్రస్తుతం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రీన్ ఆర్మీ గ్రూప్‌ను ఏర్పాటుచేసి ప్రతి ఆదివారం చెరువు పరిసరాలను శుభ్రం చేస్తామని చెబుతున్నారు. కానీ గ్రామస్తులు మాత్రం చెరువు పరిసరాల సంగతి మున్సిపల్ అధికారులు చూసుకుంటారు.. మీ కాలనీల నుంచి మురుగునీరు చెరువులోకి రాకుండా చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ సమస్య ఎక్కడికి దారితీస్తుందో వేచి చూడాల్సిందే.

గతంలో ఫిర్యాదు చేశాం



చెరువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. చెరువులోకి మురుగునీరు రావడంపై అధికారులకు ఫిర్యాదు చేశాం. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలలో ఎస్టీపీ ప్లాంట్‌లు పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించాలని అధికారులను కోరాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులోకి మురుగునీరు వదిలేవారిపై చర్యలు తీసుకోవాలి.
– ఈశ్వరిగారి రమణ, నైబర్‌హుడ్ అధ్యక్షుడు

క్షేత్రస్థాయిలో పర్యటించాలి



చెరువు పరిసరాలను శుభ్రం చేయడం మంచి కార్యక్రమమే కాని చెరువులోకి మురుగునీరు రాకుండా వారు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీల నుంచే మురుగునీరు చెరువులోకి వస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవాలి. అప్పుడే చెరువులను కాపాడుకోగలుగుతాం.
– వడ్డే నర్సింహులు, తెల్లాపూర్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

నాణ్యమైన విద్య



ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను ఈనెల మొదటి వారంలో ఆరంభించారు. ఏ ఫీజు లేకుండా అడ్మిషన్లు ఇస్తున్నారు.

కళాశాలలోని కోర్సులు

- సీఈసీ, ఎంపీసీ, బైపీసీ కోర్సులను తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో నిర్వహిస్తున్నారు.
- కంప్యూటర్‌సైన్స్‌లో ఒకేషనల్ కోర్సు కూడా అందుబాటులో ఉంది
- కళాశాలలో చేరే విద్యార్థులకు ఉచితంగా టెక్ట్స్ బుక్‌లు ఇస్తారు
- అర్హులైన ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తారు
- అర్హులైన వారందరికీ బస్ పాస్ సౌకర్యం
- లైబ్రరీ, ల్యాబ్ సౌకర్యాలున్నాయి

నాణ్యమైన విద్య అందించేందుకు కృషి



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. ఏటేటా విద్యార్థుల చేరిక గణనీయంగా పెరుగుతోంది. పదవ తరగతిలో మంచి ఫలితాలు వచ్చాయి. ఈ సారి విద్యార్థుల సంఖ్య 1000కు చేరవచ్చు.
– శ్రీనివాసులు, ప్రిన్సిపల్, రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల

టాస్కులు, కమిషన్‌ల పేరుతో మోసం

- సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, వ్యాపారి
- ఉద్యోగి రూ.4.40, వ్యాపారి రూ.4.67 లక్షలు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.4.40 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని వందనపురి కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు ఏప్రిల్ 16 న మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం: 4.40 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో కిరాణాషాప్ వ్యాపారి..

అమీన్‌పూర్ పరిధిలోని నరేందర్‌నగర్ కాలనీకి చెందిన ఓ వ్యాపారికి మే 6వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం రూ.4.67 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు, చివరికి తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి బుధవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462